సాక్షి
మంచిర్యాల
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సింగరేణిలో చెత్తశుద్ధి
సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణలో మరో ముందడుగు వేసింది. రూ.1.15కోట్లతో శ్రీరాంపూర్‌లో చెత్త శుద్ధీకరణ ప్లాంటు ఏర్పాటు చేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేసింది. 8లో▸



ఘనంగా క్రీడాదినోత్సవం
జిల్లాలో గురువారం క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /25.0
ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

పాత పనులు పక్కకే!

బెల్లంపల్లి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బృహత్ ప్రకృతివనంలో అభివృద్ధి పనులకు రూ.5కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే ఆ పనుల స్థానంలో నియోజకవర్గ వ్యాప్తంగా 223 గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు బిగించేందుకు ప్రత్యామ్నాయంగా ప్రతిపాదనలు పంపగా.. అప్పటి కలెక్టర్ ఆమోదించారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాగా, మరికొన్ని చోట్ల చేయలేదు. తర్వాత ఎన్నికలు రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. వాటికి బిల్లుల చెల్లింపులూ ఆగిపోయాయి. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఆ పనులు పూర్తిగా పక్కకు పెట్టింది. ఇక్కడ ఒక చోటే కాకుండా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో కొత్త పనులకే అనుమతులు వస్తున్నాయి. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్(జన్నారం) నియోజకవర్గ పరిధిలో నూతనంగా చేపట్టిన పనులకే అనుమతి ఇస్తున్నారు.



- గత సర్కారు పనులన్నీ నిలుపుదల
- జిల్లాలో అన్నీ కొత్త పనులకే మంజూరు
- 'ఎస్‌డీఎఫ్'లోనూ నూతనంగా ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల స్థానంలో మళ్లీ అన్నీ కొత్త పనులు చేపడుతున్నారు. శాసనసభ ఎన్నికల ముందు ఆయా ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో జిల్లాలో అనేక అభివృద్ధి పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులూ మారిపోయాయి. ఇందులో విద్య, వైద్యం, తాగు, సాగునీటితోపాటు పలు మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అనేక పనులు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు మంజూరు చేసిన పనులకు సైతం ప్రస్తుతం మోక్షం కలగడంలేదు. దీంతో అన్నీ మళ్లీ నూతన ప్రతిపాదనలతో పంపించారు.

కొత్తవాటికే మంజూరు
గత ప్రభుత్వంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభమైనవి, మధ్యలో నిలిచిపోయిన పనులకు మళ్లీ అవకాశం ఇవ్వడం లేదు. దీంతో బిల్లుల చెల్లింపులకు ఇబ్బంది కలుగుతుందనే పనులు ఆగిపోతున్నాయి. దీంతో ప్రతీ నియోజకవర్గం నుంచి పూర్తిగా కొత్త పనులకే ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు వస్తేనే మంజూరు చేస్తున్నారు. ఉదాహరణకు గత సర్కారులో మన ఊరు–మన బడి కార్యక్రమంలో అంతకుముందే పనులు ప్రారంభించారు. ఈ పథకం స్థానంలో కొత్తగా 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ల కింద 478 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. స్కూళ్లలో తాగునీరు, మూత్రశాలలు, విద్యుద్దీకరణ, మౌలిక సౌకర్యాల పెంపు కోసం పనులు సాగుతున్నాయి. ఇదే తరహాలో గ్రామాలు, పట్టణాల్లో ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన వాటికి ప్రస్తుతం పనులు సాగుతున్నాయి.

'ఎస్‌డీఎఫ్' పనుల్లోనూ..
ఇక నియోజకవర్గాల్లో స్పెషల్ డెవలప్‌మెంటు ఫండ్(ఎస్‌డీఎఫ్)లోనూ నూతనంగా ప్రతిపాదనలు పంపిన వాటికే అధికారులు ఆమోదిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గానికి రూ.10కోట్లు కేటాయించింది తెలిసిందే. వీటిలో ప్రధానంగా విద్య, తాగునీటికే రూ.2కోట్ల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మిగతా వాటిలో రోడ్లు, పారిశుద్ధ్యం, భవనాలు, ఇతర అభివృద్ధి కోసం వెచ్చించాలి. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు పంపారు. ఈ పనులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యవేక్షణలోనే ఖరు చేయాల్సి ఉంది. ఈ అభివృద్ధి పనులకు సైతం ముందస్తుగా నిధులు విడుదలయ్యే అవకాశం లేదు. దీంతో పనులు చేశాక బిల్లుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని చాలామంది కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు.

'డీఎంఎఫ్‌టీ'పైనే ఆశలు
జిల్లా పరిధిలో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండేషన్ ట్రస్ట్) సంబంధించిన నిధులే జిల్లాలో అభివృద్ధిపై ఆశలు ఉన్నాయి. గతంలో ప్రభావిత ప్రాంతాల్లో కాకుండా ఇతర జిల్లాలకు డీఎంఎఫ్‌టీ నిధులు తరలించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సింగరేణి సంస్థ చేస్తున్న బొగ్గుతోపాటు ఇతర ఖనిజ సంపదపై వస్తున్న రాయల్టీ రూపంలో జమ చేస్తున్న నిధులను 60శాతం స్థానికంగానే ఖర్చు చేసి, మరో 40ఇతర ప్రాంతాలకు వెచ్చించాలి. ముఖ్యంగా తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, నైపుణ్యం, పారిశుద్ధ్యం కోసం నిధులు కేటాయించాలి. మౌలిక వసతుల్లో భవనాల నిర్మాణం, సాగునీటి, పర్యావరణ సంరక్షణ కోసం వెచ్చించేందుకు వీలు ఉంది.

న్యూస్‌రీల్

రేపు ఉప ముఖ్యమంత్రి 'భట్టి' రాక



జైపూర్: మండల కేంద్రం జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం సందర్శించనున్నారు. సాయంత్రం 4.30గంటలకు ప్లాంటుకు చేరుకుని ఎస్టీపీపీలో నిర్మించిన సోలార్ పవర్ ప్లాంటును సందర్శిస్తారు. నూతనంగా నిర్మించిన అడ్మిన్ భవనాన్ని ప్రారంభిస్తారు. కంట్రోల్ రూంను సందర్శించి ఇటీవల నిర్మించిన సీఓ–2 మిథినాల్ ప్లాంటును ప్రారంభిస్తారు. అనంతరం ప్లాంటు విద్యుత్ విస్తరణలో భాగంగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్‌ప్లాంటు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలిస్తారు.

పీఏసీఎస్ ఉద్యోగి సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలఅగ్రికల్చర్: మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి పెంట సత్యనారాయణపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 6న 'రుణమాఫీ స్వాహా', ఈ నెల 13న ''స్వాహా'కార సంఘాలు' శీర్షికలతో 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. మంచిర్యాల పీఏసీఎస్‌లో రైతులకు తెలియకుండానే వారి పేరిట రుణాలు తీసుకుని అక్రమాలకు పాల్పడ్డారని, రుణాలు, నిధులు, ఎరువుల విక్రయాల నగదు సొంతానికి వాడుకున్నారని వెలుగులోకి తెచ్చింది. అధికారులు స్పందించి కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. రెండ్రోజుల పాటు విచారణ చేపట్టిన అధికారులు అక్రమాలపై నివేదికను రాష్ట్ర సహకార కమిషనరేట్‌కు అందజేశారు. దీంతో గురువారం సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి తెలిపారు. రైతు రుణమాఫీ, ఇతర సంఘం సంబంధిత కార్యకలాపాలలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లుగా ఆరోపణలు రాగా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకున్నారు.

క్లినిక్‌ల్లో టీజీఎంసీ బృందం తనిఖీలు



భీమారంలో తనిఖీ బృందం సభ్యులు

చెన్నూర్: చెన్నూర్, భీమారం మండల కేంద్రాల్లోని క్లినిక్‌ల్లో టీజీఎంసీ బృందం సభ్యులు గురువారం తనిఖీ నిర్వహించారు. టీజీఎంసీ కమిటీ సభ్యుడు ఎగ్గన శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎంసీ ఆదేశాల మేరకు భీమారం, చెన్నూర్‌లోని రెండు క్లినిక్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇద్దరు నకిలీ ప్రైవేట్ క్లినిక్ వైద్యులు మోతాదుకు మించి యాంటీబయోటిక్ మందులు వాడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వైద్యులను నమ్మి ప్రజలు మోసపోవద్దని, అనారోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. వీరి వద్ద లభించిన మందులను ఐఎంసీకి పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ హెచ్ఆర్‌డీపీ, డాక్టర్లు ప్రసాద్, శ్రీధర్, ఎన్ఎంసీ వైద్యులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం వరిధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్‌లతో కలిసి రైస్‌మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 1.50 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా 1.98 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 కనీస మద్దతు ధర చెల్లిస్తామని అన్నారు. ధాన్యం సేకరణకు కావాల్సిన గన్నీ సంచులు, లారీల నిర్వహణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డీఆర్‌డీఏ, పీఏసీఎస్, మెప్మా, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ, జిల్లా మార్కెటింగ్ అధికారి, తూనికలు, కొలతల శాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

క్రీడలకు సమయం కేటాయించాలి



ఉద్యోగులతో కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతి ఒక్కరూ నిత్యం కొంత సమయం వ్యాయామం, క్రీడలకు కేటాయించాలని, శారీరకంగా ధృడంగా ఉండడంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజ్‌వీరుతో కలిసి పతకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని, జీవితంలో ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంలో దోహదపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జెడ్పీ సీఈవో గణపతినాయక్, అధికారులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో తనిఖీ

మంచిర్యాలక్రైం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కలెక్టర్ ఆస్పత్రికి చేరుకోవడంతో సిబ్బందిలో ఒక్కసారిగా వణుకు మొదలైంది. సాధారణ వ్యక్తిలా ఆస్పత్రికి వచ్చిన ఆయన నేరుగా ఎమర్జెన్సీ విభాగానికి వెళ్లి బీపీ పరీక్షలు చేయించుకున్నారు. విధుల్లో ఉన్న వైద్యులు కలెక్టర్‌కు బీపీ పరీక్షలు చేసి నార్మల్‌గానే ఉందని చెప్పారు. సుమారు అరగంటపాటు అక్కడే ఉండి వెళ్లిపోయారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రరెడ్డిని సంప్రదించగా.. ఎలాంటి సమాచారం లేకుండా ఆస్పత్రికి సందర్శనకు వచ్చారని తెలిపారు.

కుటుంబ సభ్యుల నిర్ధారణకే సర్వే

- రుణమాఫీపై ఇంటింటికీ అధికారులు
- మిగతా సమస్యలు ఎప్పుడో..?
- రూ.2 లక్షలుపైబడి ఉన్నా, ఆధార్, తదితర సమస్యలు అధికం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రూ.2లక్షల రుణమాఫీ వర్తించని రైతుల ఇంటింటికీ వ్యవసాయ అధికారులు వెళ్లి కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే రెండ్రోజులుగా చేస్తున్నారు. ఏవోలు, ఏఈవోలు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. రేషన్‌కార్డు లేని, ఒకే రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యుల వివరాలు, ధ్రువీకరణ కాని దరఖాస్తులపై సర్వే చేపట్టారు. రూ.2లక్షలు పైబడి రుణం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలు, పట్టాపాస్‌పుస్తకం, పేరు పొంతన లేకపోవడం, పీఏసీఎస్, సమగ్ర సమాచారం లేని తదితర సమస్యలపై వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వీటిపై ప్రభుత్వం నుంచి మళ్లీ ఆదేశాలు వచ్చిన తర్వాత పరిశీలించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే వరకే శిక్షణ ఇచ్చారని, మిగతా అంశాలపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అంటున్నారు. దీంతో తమ సర్వే, నిర్ధారణ ఎప్పుడు అని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, నిర్ధారణ కావాల్సిన వాటికి సంబంధించి జిల్లాలో 2,423 దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డు లేనివారు, పేర్లు తొలగించబడిన వారు, రుణం తీసుకున్న సమయంలో నమోదు కాని కుటుంబ సభ్యుల వివరాలను మండల వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేసినా, దరఖాస్తు చేసుకున్న రైతుల ఇళ్లకు వెళ్లి బ్యాంకు రుణం తీసుకున్న ఖాతాలు, ఆధార్‌కార్డులను పరిశీలిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రకటించిన రైతుభరోసా పోర్టల్‌లోని అగ్రికల్చర్ ఇన్వెస్ట్‌మెంటు సపోర్టు స్కీంలో రైతులు, వారి కుటంబు సభ్యుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదేశించిన మండల వ్యవసాయ అధికారులు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా వారి పరిధిలో వచ్చిన దరఖాస్తులను రైతుల ఇళ్లకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతు కుటుంబ సభ్యులందరూ లేనిపక్షంలో అందుబాటులో ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నారు. వాటితోపాటు రైతు అందజేసిన దరఖాస్తు ఫారం, వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం, రైతు, కుటుంబ సభ్యులు, రుణాలు ఉన్న భార్యాభర్తలనే కాకుండా 18ఏళ్లు నిండిన వారితో ఏఈలు సెల్ఫీ ఫొటో దిగి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సాంకేతిక సమస్యల పరిష్కారం, ఆధార్‌కార్డులో పేర్లు, అక్షరాలు, నో డేటా ఫౌండ్, ఇతర అంశాలపై కూడా సర్వే నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



కోటపల్లి మండలంలో సర్వే చేసి సెల్ఫీ తీసుకుంటున్న వ్యవసాయ అధికారి

ఎక్కువ ఉన్నా మాఫీ చేయాలి..



రూ.2లక్షల కన్న ఎక్కువ లోను ఉన్న వాళ్లకు ఎప్పుడు మాఫీ చేస్తారో.. ఇప్పుడు కుటుంబ సర్వే చేస్తున్నారు. లోను ఎక్కువ ఉన్నవారికి రెండు లక్షలు మాఫీ చేయాలి. అన్నీ సర్వేలతో సాగదీస్తున్నారు.
– కుమ్మరి ఓదేలు, గ్రామం: అలుగామా, మం: కోటపల్లి

రైతుల దరఖాస్తులు..
జిల్లాలో చాలామంది రైతులకు సాంకేతిక, వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీకి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అర్హత కలిగి రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ఫిర్యాదుల స్వీకరణకు మండల వ్యవసాయ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో మండలంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. మొదటి విడతలో 28,589 మంది రైతులకు గాను రూ.150.28 కోట్లు, రెండో విడతలో 14,396 మందికి రూ.138.87 కోట్లు, మూడో విడతలో 13,035 మందికి రూ.173.87 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయి. మొత్తంగా 56,020 మందికి గాను రూ.463.02 కోట్లు విడుదల కాగా ఇందులో వివిధ కారణాలతో 242 మంది రైతుల ఖాతాల్లో రూ.1,16,67,963 నగదు జమ కాలేదు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

మంచిర్యాలఅగ్రికల్చర్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్, పంచాయతీరాజ్ కమిషనర్ అనితలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు మూడు దశల్లో నిర్వహిస్తామని, పంచాయతీ ఎన్నికల అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, తర్వాత పురపాలక సంఘాల ఎన్నికలు ఉంటాయని తెలిపారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. సెప్టెంబర్ 6న ఓటరు ముసాయిదా జాబితా వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, తుది జాబితాను సెప్టెంబర్ 21న విడుదల చేస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై చర్చించాలని, సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్ల ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా జాబితాను నిశితంగా పరిశీలించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవాలని, పోలింగ్ సిబ్బందిని గుర్తించి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల ఆర్డీవో రాములు, భూ సేకరణ ప్రత్యేక అధికారి చంద్రకళ, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



పాల్గొన్న కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు

'గ్రామీణులకు వైద్య సేవలు అందించడం పాపమా..?'



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

చెన్నూర్: గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడం పాపమా అని ఆర్ఎంపీ, పీఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల ఆర్ఎంపీ, పీఎంపీలు నల్లాబ్యాడ్జీలు ధరించి స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం నుంచి తహసీల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. టీజీఎంసీ తనిఖీలను వెంటనే నిలిపివేయాలని నినదించారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ చెన్నూర్ మండల అధ్యక్షులు బండారి లక్ష్మణ్, సాధనబోయిన కృష్ణ, కోటపల్లి మండల అధ్యక్షుడు మధుకర్, సుధాకర్, కట్ల శ్రీనివాస్, సత్తెయ్య, దాస్, చిలుకమరి శ్రీనివాస్, వెంగళ రమేశ్, సాంబయ్య పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి
- వేలాలలో ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభం

జైపూర్: ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా ఆరోగ్య ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి పల్లె ప్రజలకు మరింత చేరువగా వైద్యసేవలు అందిస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం మండలంలోని వేలాలలో రూ.20లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఎమ్మెల్యే బీపీ పరిశీలించారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సిబ్బందిని నియమించడంతోపాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత, వైద్యులు అనిల్, ప్రశాంతి పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు లేకుండా చూడండి
మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి కమిషనర్ వెంకటేశ్వర్లుకు సూచించారు. గురువారం మున్సిపాల్టీ పరిధిలోని ఊరుమందమర్రి, ఎర్రగుంటపల్లెలో ద్విచక్రవాహనంపై పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీ సరిగా లేవని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.



కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీపీ చూస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు
భీమారం: ప్రజలకు మరింత వైద్య మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రూ.1.43కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో పారుశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా, కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణరెడ్డి, పొడేటి రవి, మోహన్‌రెడ్డి, కొత్త సత్తిరెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

- గంజాయి రవాణా, విక్రయదారులపై పీడీ యాక్టు
- రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా నమోదైన కేసులు, విచారణలో ఉన్నవి, పెండింగ్ కేసులు, మహిళల అదృశ్యం, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో జాప్యం లేకుండా విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలని అన్నారు. నిషేధిత గంజాయి రవాణా, విక్రయదారులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నగదు మోసపోయిన బాధితులకు తిరిగి డబ్బులు ఇప్పించేందుకు కృషి చేయాలని చెప్పారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కొరడా
మంచిర్యాలక్రైం: ఇకపై వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కొరడా ఝులిపిస్తామని పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. సెప్టెంబర్ 2నుంచి ప్రత్యేక బలగాలతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనుమతి, అర్హత లేకుండా పోలీసు, ప్రెస్, ఆర్మీ ఇతర జిగ్‌జాగ్ పేర్లు, నంబరు ప్లేట్లు లేకపోవడం, ఉన్నా కనిపించకుండా చేసిన వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని, వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సామె 10:7.
జ్ఞాపకార్థ కూడిక
తేదీ : 30-08-2024
శుక్రవారం రోజున
ఉ॥ 11 గం॥ ల నుండి
మ॥ 3 గం॥ ల వరకు
కార్యస్థలం : స్వగృహం
H.No: 12-456/1, ఇస్లాంపుర,
మంచిర్యాల.



(Deputy City Planner GHMC- Secunderabad)
జననం: 30-08-1965
మరణం: 26-08-2024

క్లుప్తంగా

గంజాయి విక్రేత అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ముందు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో టూటౌన్ ఎస్సై మహేందర్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ గురువారం ఈమేరకు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి బెల్లంపల్లి నెంబర్ 2 ఇంక్‌లైన్ బస్తీకి చెందిన నాగమల్ల దత్తాత్రేయని పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 116 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

పేకాటస్థావరంపై దాడి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల శివారు బుగ్గ గుట్ట ప్రాంతంలోని మామిడి తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పక్కా సమాచారంతో రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. 8 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.19100 నగదు, 8 సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం 8 మందిని తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తాళ్లగురిజాల ఎస్సై రమేశ్, సిబ్బంది ఉన్నారు.

బైక్ ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలు

కాసిపేట: కాసిపేట పోలీసుస్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన గండ్రతి భిక్షపతితో కలిసి తాటికాయల భిక్షపతి, గడ్డపీటి వెంకన్న, కొండ సైదులు బుధవారం రాత్రి భాగ్యనగర్ రైలులో బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో దిగారు. కి.మీ దూరంలో సోమగూడెం సమీపంలో ప్రార్థనల నిమిత్తం కత్వరి చర్చికి కాలినడకన వస్తున్నారు. దుబ్బగూడెంకు చెందిన దుర్గం అంజయ్య బైక్‌పై అతివేగంగా వచ్చి వెనుక నుంచి వారిని ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన భిక్షపతి, వెంకన్న, సైదులును బెల్లంపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి మంచిర్యాలకు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలిపాలి



సీసీఫుటేజీలో రికార్డయిన కారు

భీమారం: మండలంలోని కాజిపల్లి సమీపంలో ఈనెల 18న జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై బి.రాములు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆయన మాట్లాడారు. దాంపూర్‌కు చెందిన తాళ్ల రాజు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వరినారు తీసుకెళ్తుండగా భీమారం నుంచి ఆవిడం వైపు కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో రాజు గాయపడ్డారని తెలిపా రు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పా రిపోయారన్నారు. సీసీ ఫుటేజీలో రికార్డయిన ఫొటో ఆధారంగా కారు ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తల్లి మందలించిందని తనయుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్‌కు చెందిన చెల్ల లక్ష్మణ్–లక్ష్మి దంపతుల కుమారుడు నర్సింహా (20) సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నెల క్రితం కుక్క కరవడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. పనికి వెళ్లకపోవడంతో తల్లి మందలించింది. తీవ్ర మనస్తాపం చెందిన నర్సింహా గురువారం రాత్రి ఏసీసీ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సోహెల్ ఖాన్ ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తండ్రి ఉమర్‌ఖాన్ గురువారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

సింగరేణిలో చెత్తశుద్ధి

- రూ.1.15 కోట్లతో శ్రీరాంపూర్‌లో ఏర్పాటు
- కంపెనీలోనే మొదటిది
- రేపు డెప్యూటీ సీఎం చేతుల మీదుగా ప్రారంభం!
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సీసీసీలో ఏర్పాటు చేసిన సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం మరో ముందడుగు వేసింది. ఇన్నాళ్లు కాలనీల్లో నుంచి వచ్చే చెత్త, వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పారబోసేది. దీనివల్ల నేల, గాలి, నీరు కాలుష్యమయ్యేది. దీనికి ఇక చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కంపెనీ తొలిసారిగా చెత్తను ప్రాసెస్ చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. పైలట్ ప్రాజెక్టు కింద శ్రీరాంపూర్ ఏరియా పరిధి సీసీసీలోని సీఐఎస్ఎఫ్ క్లాంప్లెక్స్ ఆవరణలో సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయగా రూ.1.15 కోట్లు వె చ్చించింది. ప్లాంట్ సామర్థ్యం 25 టన్నులు కాగా, ఎకరంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. వేస్టేజ్ కలెక్షన్ సెక్షన్, ట్రోమల్ మిషన్, ఫట్కా మిషన్, బా యిలింగ్ మిషన్, కోకోనట్ ష్రెడ్డర్‌మిషన్, యంత్రాలకు అనుసంధానం చేసే కన్వేయర్ బెల్ట్ సిస్టం పూర్తయింది.

తడి,పొడి వేరుచేసి..

శ్రీరాంపూర్ ఏరియాలోని కాలనీల నుంచి నిత్యం 20 టన్నుల చెత్తవెలువడుతుంది. ఇప్పటివరకు ఈ చెత్తను సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వెనుకాల ఉన్న కంపెనీ ఖాళీ స్థలంలో పారబోసేవారు. ఇక నుంచి ఈ ప్లాంట్‌కు తరలిస్తారు. ముందుగా తడి, పొడి చెత్తను వేరుచేస్తారు. వీటిని ప్రాసెస్ కోసం యంత్రాలున్నాయి. శుద్ధీకరణ తర్వాత వచ్చే వ్యర్థపదార్థాల నుంచి బై ప్రొడక్ట్స్‌ను తయారీకి పరిశోధనలు చేస్తున్నారు. పొడి చెత్తను యంత్రాల్లో కాల్చివాటి నుంచి ఘన రూపంలో ప్లాస్టిక్ వ్యర్థాన్ని తీస్తారు. భవిష్యత్తులో దీన్ని నుంచి ప్లాస్టిక్ టైల్స్ తయారు చేసే ఆలోచనలో కంపెనీ ఉంది. ఇక తడి చెత్తశుద్ధి తర్వాత వచ్చే వ్యర్థాల నుంచి ఎరోబిక్ కంపోస్టు తయారీకి సన్నాహాలు చేస్తున్నారు. ఈ బై ప్రొడక్ట్స్‌పై పరిశోధనల తర్వాత అప్పుడు వీటిని తయారు చేస్తారు.

రేపు డెప్యూటీ సీఎం రాక?

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్లాంట్‌ను యాజమాన్యం డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసింది. శనివారం ఆర్జీ–1 ఏరియాలో డెప్యూటీ సీఎం కార్యక్రమం ఉంది. అక్కడ నుంచి ఆయన చెన్నూర్‌లో 11 కేవీ సోలార్ ప్లాంట్ ప్రారంభానికి డెప్యూటీ హాజరవుతారు. సమయం ఉంటే అదే రోజు మధ్యాహ్నం ఈ ప్లాంట్‌ను ఆయనతో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనుకున్న ప్రకారం డెప్యూటీ సీఎం కార్యక్రమం జరిగితే మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కంపెనీ సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, ఏరియా ఇన్‌చార్జీ జీఎం శ్రీనివాస్, అధికారులు హాజరుకానున్నారు. ఇందుకోసం జీఎం, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, పర్సనల్ డీజీఎం అరవిందరావు అధికారులతో తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

‘జన్మభూమి పేరుతో వెట్టిచాకిరీ’



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: జన్మభూమి పేరుతో గనులపై కార్మికులతో అధికారులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఆరే న్యూటెక్ గనిని గురువారం యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కె బాజీసైదా సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు మస్టర్ పడ్డ తర్వాత నేరుగా విధుల్లోకి వెళ్లకుండా సర్ఫేస్‌లో జన్మభూమి పేరుతో పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఇవి నిబంధనలకు విరుద్ధమన్నారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికులను కంపెనీ అవసర నిమిత్తం సర్ఫేస్‌లో వాడుకుంటే వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. వారికి నాణ్యమైన పనిముట్లు అందించాలన్నారు. ఇంకా ఇతర సమస్యలను, రక్షణ చర్యలను కార్మికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. వీటని పరిష్కరించాలని నాయకులు గని మేనేజర్‌ను కోరారు. యూనియన్ బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, పిట్ సహాయ కార్యదర్శి మద్రి సందీప్, నాయకులు, భాష అజయ్, కర్ర వెంకటేశం, శ్రీనివాస్, మోతే నారాయణ, శ్రీకాంత్ ఉన్నారు.

ఘనంగా భీంరావు వర్ధంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదివాసీల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప నేత మాజీ మంత్రి కోట్నాక భీంరావు అని కలెక్టర్ వెంకటేష్ దోత్రె కొనియాడారు. భీంరావ్ 24వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్‌పార్క్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, భీంరావు కుటుంబసభ్యులు సోనేరావ్, కుమార్తె సరస్వతి, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు



ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు



వేలికి సిరా చుక్క పెడుతున్న ఉపాధ్యాయురాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు అట్టహాసంగా జరిగాయి. పోలింగ్ బూత్‌లు, శిక్షణ పొందిన పోలింగ్ అధికారులు ఓటరు స్లిప్‌లు, చూపుడు వేలుపై సిరా ఇలా సాధారణ ఎన్నికలను మరిపించాయి. ఓటు వినియోగం కోసం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల్లో 368 మంది పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రిన్సిపాల్ పాండురంగశర్మ, వైస్ ప్రిన్సిపాల్ సునీత పత్తి, పర్యవేక్షించగా ఎన్ఎస్ఎస్ వాలంటరీలు, అధ్యాపకులు ఎన్నికల విధులు నిర్వహించారు.

కాలినడకన హజ్‌యాత్రకు..



అబిద్‌ను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

తాండూర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన అబ్దుల్ అబిద్ కాలినడకన హజ్ యాత్రకు బయల్దేరాడు. గురువారం తాండూర్‌కు చేరుకోగా స్థానిక ముస్లింలు ఆయన్ను సన్మానించారు. ఈనెల 12న కాలినడకనతో ప్రారంభించి నేటితో 400 కి.మీ పూర్తయిందని, ఇంకా 8100 కి.మీ వెళ్లాల్సి ఉందని అబ్దుల్ అబిద్ తెలిపారు. ముస్లిం మతపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి యత్నించిన ఒకరికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్: లైంగికదాడి యత్నించిన కేసులో మండలంలోని అప్పపెల్లికి చెందిన దుర్గం ప్రకాశ్‌కు మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.15 వేలు జరిమానా విధిస్తూ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి అనంతలక్ష్మి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2000 నవంబర్ 7న అప్పపెల్లికి చెందిన మహిళపై అదేగ్రామానికి చెందిన దుర్గం ప్రకాశ్ లైంగికదాడికి యత్నించడంతోపాటు ఆమె కుమారుడిని చంపుతానని బెదిరించాడు. సదరు మహిళ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై వెంకటేశ్ కేసు నమోదు చేశారు. ఏపీపీ అజయ్‌కుమార్, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తిపై తీర్పు చెప్పారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ఏపీపీ అజయ్‌కుమార్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లు సతీశ్, కోర్టు కానిస్టేబుల్ బాపూరావును ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. షాట్‌పుట్‌లో టి.రిషిత్ బంగారు, 600 మీటర్ల పరుగుపందెంలో కె.అఖిల్ బంగారు, 300 పరుగుపందెంలో కె.సాయిరిత్విక్, 1600 మీటర్ల పరుగు పందెంలో టి.ప్రశాంత్ బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ సునీత, పీఈటీ విజయ్, చంద్రయ్య, రోహిత్ పాల్గొన్నారు.

వినియోగదారులకు తక్షణ సమచారం

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ వినియోగదారులు తక్షణ సమచారం తెలుసుకునేందుకు ఈ స్టోర్ విధానాన్ని ప్రవేశపెట్టామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బిల్లింగ్, కలెక్షన్, అంతరాయాలు, ఫిర్యాదుల వివరాలు కమాండ్ కంట్రోల్ లాగా ఒకటే చోట ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారాన్ని తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్ల లో వోల్టేజ్ వల్ల మోటార్లు కాలిపోకుండా ఉండేందుకు కెపాసిటర్ బ్యాంకులు ఎంతో మేలు చేకూర్చుస్తాయని తెలిపారు. వర్షాలు, ఈదురుగాలులు, సాంకేతికంగా విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు ప్రత్యామ్నాయ సరఫరాకు కృషి చేస్తున్నామని తెలిపారు.

‘మాతృభాష ఎంతో గొప్పది’



పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ప్రిన్సిపాల్

బెల్లంపల్లి: మాతృభాష తేనె కన్న తియ్యనైనదని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీధర్ అన్నారు. గురువారం సీఓఈలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాతృభాష ఎంతో గొప్పదని అన్నారు. మాతృభాషలో ఏ అంశం అయినా సరళంగా సులువుగా అర్థం చేసుకోవడానికి వీలు కలుగుతుందని వివరించారు. మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు విద్యార్థులు తెలుగు, హిందీ, మరాఠీ, లంబాడి భాషల్లో మాట్లాడి తెలుగులో అనువదించారు. అంతకు ముందు హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయసాగర్, జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గం రమాదేవి, పీఈటీ వామన్, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, మహేశ్, హారిక, శ్రీశైలం పాల్గొన్నారు.

పర్సు పోగొట్టుకున్న మహిళ

- అప్పగించి నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారి



సయ్యద్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎస్సైలు ప్రదీప్, గౌసుద్దీన్

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళ తన పర్సుతోపాటు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా కూరగాయలు విక్రయించే చిరువ్యాపారికి లభించడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన సరోజ తన భర్త సురేశ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా, కూరగాయల మార్కెట్ వద్ద పర్సు పోగొట్టుకుంది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీసీ కెమెరా పరిశీలిస్తుండగా, తనకు పర్సు దొరికిందని కూరగాయల వ్యాపారి సయ్యద్ అహ్మద్ అక్కడికి వచ్చి అప్పగించాడు. రూ.14వేల నగదుతోపాటు సెల్‌ఫోన్ ఉన్న పర్సును ఎస్సైలు ప్రదీప్, ఎండీ గౌసుద్దీన్ గురువారం బాధిత మహిళకు అందించారు. నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారిని సన్మానించారు.

వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: కొన్నిరోజులుగా వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కాలనీకి చెందిన రాఫెన్వాడ్ రఘు, ఉత్తం పాండురంగ పవర్, మక్కల శీను, జాదవ్ దిలీప్, రావని సోనిలు కూలీ పనిచేస్తున్నారు. వాటితో వచ్చే డబ్బులతో జల్సాలు చేయడంతోపాటు మద్యం తాగేవారు. జల్సాలకు డబ్బు సరిపోక శ్రీ వెంకటేశ్వరరావు, సిరి వైన్స్ షాపుల్లో చోరీ చేశారు. ఈనెల 27న సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్ షటర్ తాళాలు రాడ్లతో పగులగొట్టారు. సీసీ కెమెరాలు, టీవీని ధ్వంసం చేసి, కౌంటర్‌లో రూ.40 వేల నగదు, ఒక కంప్యూటర్, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. బార్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్ పోలీసుల సహకారంతో 24 గంటల్లో నలుగురిని అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు సాయికృష్ణ, రవి, రమేశ్, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

బాసరలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను గురువారం ఆల య అధికారులు లెక్కించారు. అక్షరాభ్యాస మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 79 రోజుల హుండీ ఆదాయం రూ.99,17,200, మిశ్రమ బంగారం 116 గ్రాములు, మిశ్రమ వెండి 4,700 గ్రాములు, విదేశీ కరెన్సీ 35 నోట్లు వచ్చాయని ఈవో విజయరామారావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన వైదిక పరిపాలన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోలీసు ల సిబ్బంది, దేవస్థాన వాగ్దేవి సొసైటీ, శివరామ కృష్ణ భజన మండలి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



వివరాలు అడుగుతున్న డీఈఓ యాదయ్య

వేమనపల్లి/కోటపల్లి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని డీఈఓ యాదయ్య హెచ్చరించారు. వేమనపల్లి మండలం క్యాతన్‌పల్లి, కల్మలపేట, ముల్కలపేట, ముల్కలపేట ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలు, కోటపల్లి మండలం సుపాక, వెంచపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పార్‌పల్లి పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాతన్‌పల్లిలో సమయానికి హాజరు కాని ఉపాధ్యాయుడు కే.సునిల్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయురాలు శ్యామల, కల్మలపేట పాఠశాల ఉపాధ్యాయురాలు డి.కవితలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమాల్లో సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈఓ తిరుపతిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి, హెచ్ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

‘గిడుగు’ జాతీయ సాహితీ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కవులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన నలుగురు కవులకు ‘గిడుగు జాతీయ సాహితీ పురస్కారాలు దక్కాయి. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిడుగు జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ భీమేశ్‌కు కవిత్వం విభాగంలో స్వేచ్ఛకు సంకెళ్లు పుస్తకానికి, తుమ్మల దేవరావ్ రాసిన మట్టిపాదాలు కవితాసంపుటికి పురస్కారాలు దక్కాయి. గిడుగు జాతీయ కళా సేవారంగంలో నేరెళ్ల హనుమంతు, తొడిశెట్టి పరమేశ్వర్‌కు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సాహిత్యం–వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, ప్రముఖ కవి బిక్కి కృష్ణ, తెలుగు వన్ నిర్మాత కంఠమనేని రవిశంకర్, ఆంధ్రప్రభ సంపాదకుడు వైఎస్ఆర్ శర్మ, విమల సాహితీ అధ్యక్షుడు డా.జల్ది విద్యాధర్, శంకరం వేదిక అధ్యక్షురాలు యలవర్తి ధనలక్ష్మి, ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోవింద్ సర్కార్(24) బతుకుదెరువు కోసం నిర్మల్ జిల్లాకు వచ్చాడు. కూలీగా వరినాట్లు వేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 23న వరినాట్ల డబ్బుల కోసం బైక్‌పై కడెంకు వెళ్లి తిరిగివస్తున్నాడు. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్–ఒడ్డెపెల్లి జాతీయ రహదారి పక్కన మొక్కజొన్న కంకులు కొనుగోలు చేస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

పక్షవాతంతో భార్యను చూడలేక భర్త ఆత్మహత్య

బోథ్: పక్షవాతంతో బాధపడుతున్న భార్యని చూడలేక మనోవేదన చెందిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కనుగుట్టలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల నడిపెన్న(80) భార్య ఆకుల లక్ష్మి గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. పక్షవాతం బారిన పడిన భార్యను చూసి కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. పెద్ద కుమారుడు రాజేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మునుగూరి వెంకటేశ్ (60) ప్రమాదవశాత్తు సదర్మాట్ కాలువ బ్రిడ్జి పై నుంచి పడి మృతిచెందాడు. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..గురువారం శివాజీనగర్–అంబేద్కర్‌నగర్ మధ్యలో గల కాలువపై రోడ్డు పక్కన బ్రిడ్జిపై వెంకటేశ్ కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. గమనించిన కాలనీవాసులు అతన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్నకుమారుడు భూమేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుత్తాపూర్‌లో ఈనెల 27న రాత్రి జరిగిన దొంగతనం కేసులో మరో నిందితుడిని పోలీసులు గురువా రం పట్టుకున్నారు. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

నెమలిని కాపాడిన రైతు



అటవీఅధికారులకు నెమలిని అప్పగిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ శివారులో జాతీయ పక్షి నెమలిని కుక్కలు గురువారం రాత్రి వెంబడించాయి. రైతు సురుకుంట వినోద్‌రెడ్డి గమనించి కాపాడాడు. గాయపడిన నెమలి గురించి వీడీసీ అధ్యక్షుడు వెంకట్‌కు వివరించాడు. స్పందించిన ఆయన అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డిలు నెమలికి ప్రాథమిక చికిత్స అనంతరం అటవీప్రాంతంలో వదిలేశారు. నెమలిని కాపాడిన రైతును అటవీ అధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పంజేష మొహల్లాకు చెందిన తల్లి, కూతురు పిన్నంవార్ చిట్టి, మనస్వితలు బుధవారం ఇంటి నుంచి రైల్వే స్టేషన్ వైపు కాలినడకన వెళ్తున్నారు. వెనుక నుంచి ఒకరు బైక్‌పై వచ్చి ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని రిమ్స్‌కు తరలించారు. ఆమె భర్త శ్రీనివాస్ గురువారం ఫిర్యాదు చేయగా, ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఖానాపూర్: పట్టణంలోని లారీఅడ్డా ప్రాంతంలో బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు గురువారం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయంతో ఇరువురు ఒకరినొకరు విమర్శించుకొని రోడ్డుపై కాసేపు గొడవపడ్డారు. కాగా, బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, రోడ్డు ప్రమాద బస్సు, బైక్ ఢీకొన్న చిత్రాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాద ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లింబాద్రి తెలిపారు.